నిరుద్యోగ యువతకు మెరుగైన శిక్షణ


ఐటీఐని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెద్దపల్లిలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) ఏర్పాటుతో నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. శనివారం ఆయన ప్రభుత్వ ఐటీఐని పరిశీలించి వసతులపై ఆరా తీశారు. కొత్తగా నిర్మించే భవన సముదాయ నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఐటీఐ భవనంలో మరమ్మతు కోసం ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏటీసీ కోర్సుల్లో చేరాలని సూచించారు. టీజీఐసీ సీఈవో జోగిందర్, ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు ఆవిష్కర్తలుగా ఎదగాలి: ఎంపీ


గురుకులానికి బెంచీలు అందజేస్తున్న ఎంపీ వంశీకృష్ణ

ధర్మారం, న్యూస్‌టుడే: వనరులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఆలోచనలకు పదును పెట్టాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ సూచించారు. విశాఖ ట్రస్టు ఆధ్వర్యంలో ధర్మారం మండలం మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకులానికి మూడు విడతలుగా 150 బెంచీలను వితరణ చేయగా, శనివారం చివరి విడత పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గురుకులంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ దేవసేన, ఏఎంసీ ఛైర్మన్ రూప్లానాయక్, కాకా ఫౌండేషన్ ఇన్‌ఛార్జి సూర్యనారాయణ, నాయకులు తిరుపతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, మల్లయ్య, అజయ్‌పాల్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పత్తిపాక రహదారి వద్ద భూసార పరీక్షల కేంద్రాన్ని ఎంపీ ప్రారంభించారు.

ఈనాడు
పెద్దపల్లి
ఆదివారం అక్టోబరు 20, 2024

అధ్యయనంతో.. ఉత్తమ గ్రేడ్‌లు



పది విద్యార్థులకు విషయ నిపుణుల సూచనలు

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

పాఠశాల స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు అత్యంత కీలకం. ఇప్పటి నుంచే ఉత్తమ గ్రేడ్లు సాధించేందుకు ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఆశించిన ఫలితాల కోసం సాధన చేస్తున్నా.. వారిలో ఎక్కడో ఒకింత ఆందోళన, సందేహాలు ఉన్నాయి. గణితం, సామాన్యశాస్త్రంతో పాటు భాషా అంశాలు, సాంఘిక శాస్త్రం ప్రణాళికతో చదివితే విద్యార్థులు ఉత్తమ గ్రేడ్లు సాధించవచ్చు. పదో తరగతిలో భాషా అంశాల్లో ఉత్తమ గ్రేడ్ల సాధనకు సన్నద్ధత, ప్రణాళికపై విషయ నిపుణుల సూచనలతో 'న్యూస్‌టుడే' కథనం.


పెద్దపల్లి జిల్లా పోతారం జడ్పీ ఉన్నత పాఠశాలలో సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు


జి.సురేందర్ మోహన్, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, జడ్పీ ఉన్నత పాఠశాల, నాగులమల్యాల

ప్రణాళికతో ఆంగ్లంలో మంచి ఫలితాలు

విద్యార్థులు ఇప్పటి నుంచే ఆంగ్లం పాఠ్యాంశాలను ప్రణాళికతో చదివితే ఉత్తమ జీపీఏ సాధించడం సులభం. పరీక్షలో ఎక్కువగా డిస్క్రిప్టివ్స్, క్విజ్ టెస్ట్, గ్రామర్, అన్‌సీన్ పోయమ్స్ అడుగుతారు. వీటిని విద్యార్థులు ఒకటికి రెండుసార్లు ఒక్కో భాగాన్ని ఒక్కోసారి చదవాలి ప్రణాళిక వేసుకోవాలి.
● ప్రశ్నపత్రంలోని 1-8 వరకు ఉన్న ప్రశ్నల్లో 1-4 రీడింగ్ ఎ నుంచి, 5-8 రీడింగ్ బి, సి నుంచి అడుగుతారు. ఇందుకోసం పుస్తకంలోని అన్ని పాఠాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. ప్రశ్నలకు సమాధానాలు సూటిగా, అర్థవంతంగా రాయాలి. ఇందుకు మాదిరి ప్రశ్నలపై అవగాహన పెంచుకోవాలి. ఒక పేరాలో కొన్ని ప్రశ్నలను తరగతి ఉపాధ్యాయుడి ద్వారా తయారు చేయించుకుని ఒక్కో ప్రశ్నకు రెండు మూడు జవాబులు రాసి ఉపాధ్యాయులతో సరిచేయించుకోవాలి.
● 9-12 వరకు గల ప్రశ్నల్లో బార్ గ్రాఫ్, పై చార్ట్స్, గ్రాఫిక్ టేబుల్స్ వంటి వాటి నుంచి అడుగుతారు. కొన్నిసార్లు ఇచ్చిన టేబుల్ లేదా గ్రాఫ్ గురించి అడుగుతారు కాబట్టి జవాబులు ఆ ప్రశ్నల్లోనే ఉంటాయని గుర్తుంచుకోవాలి. ప్రశ్నలు హేతుబద్ధంగా ఉంటాయి కాబట్టి ఆలోచించి జవాబు రాసేలా సన్నద్ధం కావాలి.
● పేరాగ్రాఫ్ ఆధారంగా జవాబులు రాయడంలో వ్యాకరణ అంశాలు ఉంటాయి. గత ప్రశ్నపత్రాలు చూస్తే వాయిస్, స్పీచ్, క్వశ్చన్ ట్యాగ్స్‌పై ప్రతి సారి ప్రశ్నలు వస్తున్నాయి. వాటిల్లో దాదాపు 10 రకాలు ఉంటాయి కాబట్టి ఒక్కో రకాన్ని ఒక్కో రోజు ప్రాక్టీస్ చేస్తూ ఉండాలి.
● డిస్క్రిప్టివ్ ప్రశ్నలను విద్యార్థులు ఎంత బాగా రాయగలిగితే అన్ని మార్కులు వస్తాయి. ఇందుకోసం వాటిపై ఇప్పటి నుంచే రాయడం అలవాటు చేసుకోవాలి. రాత నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి.
● పార్ట్-బిలో అన్‌సీన్ పద్యాలు, గద్యభాగం (ప్రోజ్), క్విజ్ టెస్ట్, ఎడిటింగ్ వంటి వాటిపై ప్రశ్నలు అడుగుతారు. అన్‌సీన్ పద్యం, ప్రోజ్‌లను క్షుణ్ణంగా అర్థం చేసుకుంటే జవాబులు రాయవచ్చు. ఇందుకోసం కొన్ని అన్‌సీన్ పద్యాలు, ప్రోజ్‌లను అంతర్జాలంలో సేకరించి చదువుకోవాలి.
● ఎడిటింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు పాఠ్యపుస్తకం నుంచి ఇస్తారు. కాబట్టి పుస్తకంలోని పాఠాలను క్షుణ్ణంగా చదివి అవగాహన పెంచుకోవాలి. ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్, టెన్సెస్, లింకర్స్, పర్యాయపదాలు, వ్యతిరేక పదాలు, అర్థాలపై దృష్టి నిలపాలి.
● విద్యార్థులు ఇప్పటి నుంచే ఆంగ్ల భాషలో రాయడం, చదివి అర్థం చేసుకునే నైపుణ్యాలను పెంచుకోవాలి. ప్రశ్నలు చదివి అర్థం చేసుకునే సామర్థ్యం కలిగి ఉండాలి.

నిత్యాభ్యసనంతో తెలుగు సులువు


రాజాల రవీందర్, పాఠ్యపుస్తక రచయిత, కరీంనగర్

నిత్య అభ్యాసం ద్వారా తెలుగులో ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. 12 పాఠాలు, ఉపవాచకంలోని ఆరు అంశాలు విభజించుకుని ఏ రోజు ఏం చదవాలో నిర్ణయించుకోవాలి. కష్టమైన అంశాలను గుర్తించి వాటిపై దృష్టి పెట్టాలి.
● అన్ని పాఠాల కవి పరిచయాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని చదవాలి. తరవాత వాటిని చూడకుండా రాస్తూ తప్పు ఒప్పులను గుర్తించాలి.
● పరిచిత పద్యం కోసం ముఖ్యమైన 17 పద్యాలను జ్ఞాపకం ఉంచుకోవాలి.
● స్వీయరచనల ప్రశ్నలకు అనుగుణంగా జవాబు రాసేలా సాధన చేస్తూ ఉండాలి. దానశీలం, వీర తెలంగాణ, కొత్తబాట, భాగ్యోదయం, శతక మధురిమ, గోల్కొండ పట్టణం, భిక్ష, భూమిక పాఠాలపై ప్రత్యేక దృష్టి నిలపాలి.
● అవగాహన, ప్రతిస్పందన సంబంధించిన పరిచిత అపరిచిత గద్యాంశాలకు సంబంధించిన పాఠాలను ఒకటికి రెండు సార్లు చదివి వాటిల్లో చెప్పిన అంశం ఏమిటి? దేనికి సంబంధించింది? ఎందుకోసం ఉద్దేశించింది అనే ప్రశ్నలు విద్యార్థులు వేసుకుని పూర్తిస్థాయిలో వాటిపై అవగాహన పెంచుకోవాలి.
● పాఠ్యాంశ బిట్ల ప్రశ్నలు, అభ్యాసాల్లోని ప్రశ్నలు, వాటి స్వభావం, పూర్తి స్థాయి అవగాహన ఉండాలి.
● పరీక్షలో జవాబులను క్రమపద్ధతిలో వాక్య నిర్మాణ క్రమం పాటిస్తూ, అక్షర దోషాలు లేకుండా రాసేలా తరచూ సాధన చేయాలి.
● సృజనాత్మక ప్రశ్నల్లో లేఖ, సంభాషణ, కరపత్రం, కవిత, గేయం, ఆహ్వాన పత్రిక, ఆత్మకథ, నినాదాలు, సూక్తులు, అభినందన వ్యాసం, అభినందన పత్రం, ఇంటర్వ్యూ ప్రశ్నలు, వ్యాసం వంటి ప్రక్రియలపై అవగాహన ఉండాలి.
● పాఠాల చివరన వ్యాకరణాంశాలతో పాటు పుస్తకం చివరలోని పద పట్టిక నిఘంటువును తరచూ చదవాలి.
● అక్షర, అన్వయ దోషాలు లేకుండా.. వాక్య నిర్మాణం సరిగ్గా ఉండేలా పరీక్షల్లో జవాబులు రాయాలి.

హిందీ నమూనా ప్రశ్నపత్రాల సాధన ముఖ్యం


షరీఫ్ అహ్మద్, హిందీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్, కరీంనగర్

● పాఠాల్లోని భావం పూర్తిగా అర్థం చేసుకుని సమాధానాలు రాయడం అలవాటు చేసుకోవాలి. నమూనా ప్రశ్నపత్రాలను తరచూ సాధన చేయాలి.
● ఉపవాచక గద్యాంశాలకు సంబంధించిన పాఠ్య పుస్తకంలోని కవుల హిందీ కథలు, వ్యాసాలు చదవాలి.
● పద్య భాగంలో వాడిన పదాలు, శైలి, అభివ్యక్తి గుర్తుపెట్టుకుని సాధన చేయాలి. కవి గురించి తెలుసుకోవాలి.
● అర్థ గ్రాహ్యత- ప్రతిక్రియలో అక్షర దోషాలు లేకుండా క్రమం తప్పకుండా శాస్త్రీయ సమాధానాలు రాయాలి. ఒకటి రెండు వాక్యాల్లో సమాధానం రాయాలి.
● వర్ణ దోషాలు లేకుండా రోజూ కొన్ని పదాలను రాయడం అలవాటు చేసుకోవాలి. అల్పప్రాణ్, మహాప్రాణ్ ధ్వనులు, ఎక్కువగా ఉచ్చరించే అక్షరాల మధ్య తేడాలు తెలుసుకోవాలి.

సాంఘికశాస్త్రంలో సమకాలీన అంశాలపై ప్రశ్నలు


ఎ.కుమారస్వామి, రిసోర్స్ పర్సన్, కరీంనగర్

సాంఘిక శాస్త్రంలోని 21 అధ్యాయాలను విద్యార్థులు ఇప్పటి నుంచే అవగాహనా, ప్రణాళికతో చదివితే ఉత్తమ గ్రేడ్లు సాధించవచ్చు. చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలి.
● పాఠ్యాంశంలో చర్చించిన విషయాల ఆధారంగా ప్రస్తుత సమకాలీన అంశాలపై ప్రశ్నలు వస్తాయి. అందుకని లింగ వివక్ష, బాలికల విద్య, పర్యావరణం, భూగర్భ జలాలు, వలసలు, పట్టణీకరణ, సేంద్రియ ఎరువులు, భూగోళం వేడెక్కడం, ప్రపంచ శాంతి, ఓటు ప్రాధాన్యం, ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియ వంటి అంశాలపై పట్టు సాధించాలి.
● భారతదేశ చిత్రపటంలో రాష్ట్రాలు- రాజధానులు, భూ స్వరూపాలు, నదులు.. ప్రపంచ పటంలో ప్రముఖ ప్రదేశాలు, ఆయా దేశాలు, వాటి రాజధానులను గుర్తించేలా సాధన చేయాలి.
● తెలంగాణ రాష్ట్ర చిత్రపటం గీయడం సాధన చేయాలి.
● సమాచార నైపుణ్యం కింద ప్రశ్నలను పుస్తకంలోని 2, 3, 6, 8, 10, 12, 15, 19, 21 అధ్యాయాల్లో గ్రాఫులు, పట్టికల విశ్లేషణతో అధ్యయనం చేయాలి. దత్తాంశ విశ్లేషణ, సూచనలు ఆధారంగా సమాధానం రాయడం నేర్చుకోవాలి.
● ప్రణాళికతో విద్యా ప్రమాణాల ఆధారంగా వివిధ ప్రశ్నలకు సమాధానాలు రాసేప్పుడు సూచనలు పాటిస్తూ రాయడాన్ని అలవాటు చేసుకోవాలి. ఎస్‌సీఈఆర్టీ సాంఘికశాస్త్ర అభ్యాసన దీపికలను అధ్యయనం చేయడం ద్వారా ఎక్కువ మార్కులు సాధించవచ్చు.

ఖాళీ స్థలాలతో ఇంధనం

సింగరేణి ప్రాంతాల్లో బంకులు ● లీజు పద్ధతిలో కేటాయింపు

న్యూస్‌టుడే, గోదావరిఖని

సింగరేణి తన ఆదాయాన్ని పెంచుకోవడానికి మరో కొత్త మార్గాన్ని ఎంచుకుంది. ఖాళీగా ఉన్న విలువైన స్థలాల్లో పెట్రోలు, డీజిల్ బంకులు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. వీటిని లీజుకు ఇవ్వనున్నారు. దీంతో సింగరేణి వ్యాప్తంగా ఖాళీగా ఉన్న విలువైన ప్రాంతాల భూములతో కంపెనీకి ఆదాయం సమకూరే అవకాశం ఏర్పడనుంది.

మార్కెట్ విలువ ప్రకారమే..

మార్కెట్ విలువ ప్రకారమే సింగరేణి స్థలాలను లీజు విధానంలో కేటాయించి సంవత్సరానికి కొంత ఆదాయాన్ని సమకూర్చుకోనుంది. సంస్థలో మొత్తం 42 వేల మంది ఉద్యోగులు ఉండగా.. కొన్ని కార్మిక కాలనీలు పట్టణానికి దూరంగా ఉన్నాయి. ఇంధనం కోసం 2 లేదా 3 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుంది. దీన్ని గమనించిన సింగరేణి.. మందమర్రి, సెంటినరీకాలనీ, గోదావరిఖని, యైటింక్లైయిన్‌కాలనీ, భూపాలపల్లి, మణుగూరు, కొత్తగూడెం ప్రాంతాల్లో బంకులు ఏర్పాటు చేసుకునేందుకు స్థలాలను నిర్ణయించింది.

నాణ్యతకు ప్రాధాన్యం..

ఏర్పాటుకు ఆహ్వానిస్తున్న ఇంధన కంపెనీల అవుట్‌లేట్‌ల ద్వారా బంకులు నిర్వహించే అవకాశం ఉండటంతో.. కార్మికులకు నాణ్యమైన ఇంధనం అందుబాటులో లభించే అవకాశముంది. అలాగే సింగరేణికి చెందిన స్థలాలు చాలాచోట్ల వాణిజ్య పరంగా వినియోగించుకునే ప్రాంతాల్లో ఉన్నాయి. వాటి విలువ కూడా అధికంగా ఉండటం కలిసివచ్చే అంశం. మరోవైపు ఆయా ప్రాంతాల్లో కంపెనీ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. వాటిని కాపాడుకోవడంతోపాటు ఆదాయాన్ని సమకూర్చుకోనుంది.


ఖని ఆర్టీసీ డిపో సమీపంలో బంకు ప్రతిపాదిత స్థలం

ప్రతిపాదిత ప్రాంతాలు

- గోదావరిఖని ఆర్టీసీ డిపో సమీపంలో
- యైటింక్లైయిన్‌కాలనీ, పోతనకాలనీ రోడ్ లక్ష్మీనగర్‌లో
- గోదావరిఖని-సెంటినరీకాలనీ సమీపంలోని రెడ్డికాలనీ
- సెంటినరీకాలనీలోని మంథని రోడ్డు సీ-2 టైప్ క్వార్టర్లకు ఎదురుగా

ఈనెల 28 గడువు

ఈ నెల 28లోపు టెండర్లను ఆహ్వానించేందుకు ముగింపు తేదీగా నిర్ణయించారు. ఒక్కో బంకుకు 748 చదరపు అడుగుల నుంచి 3,617 చదరపు అడుగుల వరకు ఆయా ఏరియాల పరిధి ఆధారంగా కేటాయించేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఉన్న మార్కెట్ విలువ ఆధారంగా సంబంధిత శాఖ నిర్ణయించిన ధర ప్రకారం లీజుకు కేటాయించేందుకు ఇంధన కంపెనీలతో అంగీకారం కుదుర్చుకోనుంది. ఒక్కో స్థలాన్ని 20 నుంచి 30 ఏళ్ల వరకు లీజు పద్ధతిలో కేటాయించి ప్రతి మూడేళ్లకు ఒకసారి దాని విలువ పెంచుకునే విధంగా ఒప్పందం చేసుకోనుంది.


ట్రాన్స్‌జెండర్లతో సమావేశమైన జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్

స్వయం ఉపాధిపై అవగాహన

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ట్రాన్స్‌జెండర్లకు గృహ, విద్య, ఆరోగ్యం, రక్షణ తదితర అంశాలపై శనివారం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో అధికారి వేణుగోపాల్ అవగాహన కల్పించారు. జీవిత బీమా, ఆధార్ కార్డు ప్రాముఖ్యంపై వివరించారు. ట్రాన్స్‌జెండర్లపై వివక్ష నిర్మూలనకు బ్యాంకు రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పర్యవేక్షకుడు రాజయ్య, సీడీపీవో అలేఖ, పోషణ్ అభియాన్ సమన్వయకర్త అనిల్‌కుమార్, ట్రాన్స్‌జెండర్ జిల్లా అధ్యక్షురాలు కామేశ్వరి, కావ్య, సలోని, లాస్య పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి


పదోన్నతి పొందిన హెడ్‌కానిస్టేబుళ్లతో సీపీ శ్రీనివాస్

గోదావరిఖని, న్యూస్‌టుడే: రామగుండం కమిషనరేట్ పరిధిలో ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా పదోన్నతి లభించింది. సీపీ శ్రీనివాస్ శనివారం వారికి బ్యాడ్జీలను అలంకరింపజేశారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అదనపు డీసీపీ రాజు, ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

జట్టుగా శ్రమించి విజయం సాధించాలి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: క్రీడల్లో జట్టుగా శ్రమించి విజయం సాధించాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ సూచించారు. ఎస్జీఎఫ్ అండర్-14, 17 విభాగాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు సుల్తానాబాద్‌లో జరుగుతున్నాయి. శనివారం ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై, డీవైఎస్‌వో సురేశ్‌తో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో క్రీడా అసోసియేషన్ ప్రతినిధులు రవీందర్, శ్రీనివాస్, లక్ష్మణ్, రమేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

శివారు కాలనీలు.. అపరిశుభ్రతకు నిలయాలు

జిల్లాకేంద్రంలోని టీచర్స్‌కాలనీ ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా రహదారులు నిర్మించినా ప్రధాన రోడ్డు మినహా ఇతర వీధులకు మురుగు కాలువలు నిర్మించలేదు. ఇళ్ల నుంచి వచ్చే మురుగు ఖాళీ స్థలాల్లో చేరుతుండటంతో దోమల బెడద పెరిగింది. ఈ కాలనీ నుంచి రైల్వే ట్రాక్ వైపు ఉన్న వ్యవసాయ భూముల్లోకి మురుగు రాకుండా రైతులు అడ్డుకోవడం సమస్యను మరింత తీవ్రతరం చేసింది. ఇక్కడి శివారు కాలనీలకు కనీసం రోడ్డు కూడా లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పురపాలిక పరిధిలోని 2, 3 వార్డుల్లో విస్తరించిన శాంతినగర్‌లోనూ మురుగు కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. ఐటీఐ వెనుక వైపు, ఎఫ్‌సీఐ గోదాముల ప్రాంతంలోని వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించిన పురపాలిక అధికారులు డ్రైనేజీలను విస్మరించడంతో మురుగు ఇళ్ల మధ్య ఖాళీ ప్రాంతాల్లోకి చేరుతోంది. ఇక్కడ రైల్వే ట్రాక్‌కు సమాంతరంగా భారీ కాలువ నిర్మించి, మురుగును మంథని పాత గేటు సమీపంలోని కల్వర్టులోకి మళ్లిస్తే సమస్య పరిష్కారం కానుంది. బంధం చెరువు వైపు కాలనీల్లోనూ కాలువలను అభివృద్ధి చేసి, దుర్గంధం నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పెద్దపల్లి


శాంతినగర్‌లో ఇళ్ల మధ్య మురుగు



టీచర్స్‌కాలనీలో అపరిశుభ్రంగా పరిసరాలు

ధ్రువపత్రాలు సకాలంలో జారీ చేయాలి


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, మీసేవా కేంద్రాల ద్వారా పలు ధ్రువపత్రాలను సకాలంలో జారీ చేయాలన్నారు. తహసీల్దార్ జ్యోతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఆణిముత్యాలు



న్యూస్‌టుడే, కరీంనగర్ క్రీడా విభాగం

పరుగు పందెం.. నడక పోటీలు.. మారథాన్‌లు.. ట్రయథ్లాన్.. స్టీపుల్ ఛేజ్.. పోటీలు ఏవైనా జిల్లా క్రీడాకారులు ప్రత్యర్థులను దాటి విజేతలుగా నిలిచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వన్నె తెస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తూ భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తున్నారు. గత సెప్టెంబరు 19, 20లలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో.. అక్టోబరు 7, 8లలో హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించి చాంపియన్లుగా నిలిచారు. వారిపై 'న్యూస్‌టుడే' కథనం.

క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యం



కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన రాజయ్య-లక్ష్మిల కుమారుడు విశాల్ ప్రసాద్ ఎస్సారార్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. లక్ష్మి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్మికురాలు. క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యంగా 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్, 1500, 5000 మీటర్ల పరుగు సాధన చేస్తున్నాడు.

■ 2023లో ఖమ్మంలో జరిగిన సీనియర్ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో స్టీపుల్ ఛేజ్‌లో బంగారు పతకం, 5000 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం సాధించాడు. అదే ఏడాది సెప్టెంబరులో వరంగల్‌లో జరిగిన సౌత్‌జోన్ జాతీయ స్థాయి పరుగు పోటీల్లో 4వ స్థానంలో నిలిచాడు.

■ డిసెంబరులో కామారెడ్డిలో జరిగిన క్రాస్ కంట్రీ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ 8 కి.మీ విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు.

■ 1500 మీటర్ల పరుగు పోటీలో వెండి పతకం గెలుచుకున్నాడు. ఆగస్టులో కరీంనగర్‌లో నిర్వహించిన సౌత్‌జోన్ జూనియర్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో స్టీపుల్ ఛేజ్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. 5000 మీటర్ల పోటీలో వెండి పతకం నెగ్గాడు.

దేశానికి ప్రాతినిధ్యం వహించాలని..



ఎడ్ల విష్ణువర్ధన్

కరీంనగర్ జిల్లాకు చెందిన ఎడ్ల శేఖర్-రజిత దంపతుల కుమారుడు విష్ణువర్ధన్ ఎస్సారార్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దేశం తరఫున ఆడాలనే లక్ష్యంతో 10,000 మీటర్ల రేస్ వాక్ సాధన చేస్తున్నాడు.

■ ఈనెల 8 నుంచి 10 వరకు అండర్-20 ఏషియన్ సెలక్షన్స్ (ట్రయల్స్), జాతీయ జూనియర్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటాడు.

■ 2023 సెప్టెంబరులో వరంగల్‌లో జరిగిన సౌత్ జోన్ జాతీయ స్థాయి పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచాడు. నవంబరులో కోయంబత్తూరులో జరిగిన జూనియర్ నేషనల్స్ ఛాంపియన్‌షిప్‌లో ఆరో స్థానంలో నిలిచాడు.

■ 2024 జనవరిలో చెన్నైలో జరిగిన ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో.. చండీగఢ్‌లో ఓపెన్ నేషనల్ రేస్ వాకింగ్ ఛాంపియన్‌షిప్‌లో.. 2024 మార్చి లఖ్‌నవూలో జరిగిన జూనియర్ జాతీయ అండర్-20 అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటాడు.

ఒలింపిక్స్‌లో ఆడటం ధ్యేయం



జి. నక్షత్ర

సిద్దిపేట జిల్లా శనిగరానికి చెందిన రామకృష్ణ-శ్రీనిధి దంపతులు కరీంనగర్ భగత్‌నగర్‌లో ఉంటున్నారు. వీరి కూతురు జి.నక్షత్ర రెండేళ్ల నుంచి 'ఈనాడు-లక్ష్య' అకాడమీలో పరుగు పందెంలో శిక్షణ పొందుతోంది. కోచ్ తిరుపతి శిక్షణలో ఎన్నో పతకాలు సాధించింది.

■ ఈనెల 17 నుంచి 19 వరకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన దక్షిణ భారత జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకం సాధించింది.

■ 2024 అక్టోబరు 7, 8లలో హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో ట్రయథ్లాన్ పోటీల్లో జాతీయ రికార్డు సాధించి బంగారు పతకం గెలిచింది. 2024 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

■ 2023 అక్టోబరు 16న హనుమకొండలో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో ట్రయథ్లాన్ పోటీల్లో కాంస్య పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించింది. ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో 10 బంగారు పతకాలు, 8 రజత పతకాలు.. జిల్లా స్థాయిలో సుమారు 300 వరకు బంగారు, రజత, కాంస్య పతకాలు కొల్లగొట్టింది.

■ ఒలింపిక్స్‌లో దేశం తరఫున ఆడటం తన లక్ష్యమని పేర్కొంది.

పోరాటాల గడ్డపై సరస్వతీ పుత్రులు

ఉపకులపతులుగా సిరిసిల్ల విద్యావేత్తలు

ఈనాడు, సిరిసిల్ల

సిరిసిల్ల ప్రాంతం పోరాట యోధులకే కాదు.. సాహితీ దిగ్గజాలను.. విద్యావేత్తలను అందించింది.. ఈ ప్రాంతానికి చెందిన పలువురు విశ్వవిద్యాలయాలకు కులపతులుగా, ఉప కులపతులుగా పని చేసి విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టారు.. గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన జీవన్ శ్రీనివాస్ తాజాగా పాలమూరు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన నేపథ్యంలో ఈ ప్రాంతానికి చెందిన విద్యావేత్తలపై కథనం.


■ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.సి.నారాయణరెడ్డి వేములవాడ మండలం హన్మాజీపేటలో జులై 29, 1931లో జన్మించారు. తన ప్రాథమిక విద్యను వీధి బడిలో ప్రారంభించారు. తెలుగులో పీజీ చేసిన ఆయన పీహెచ్‌డీ పూర్తి చేశారు. కళాశాల అధ్యాపకుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన ఓయూ తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పని చేశారు. కవి, గేయ రచయిత, సాహితీ వేత్తగా తనదైన ముద్ర వేసిన ఆయన విశ్వంభర కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారం అందుకున్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీసీగా 1985-87 వరకు సేవలందించారు. 1989లో తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులై రెండేళ్లపాటు ఆ హోదాలో ఉన్నారు. 2017లో ఆయన కన్నుమూశారు.

■ దూరవిద్య పితామహుడు జి.రాంరెడ్డి 1929లో వేములవాడ మండలం మల్లారంలో జన్మించారు. రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ చేసిన ఆయన ఆచార్యులుగా పని చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దూరవిద్యను తీసుకురావాలని అనేక దేశాల్లోని విద్యా వ్యవస్థలపై పరిశోధన చేశారు. ఆయన కృషి ఫలితంగానే 1982లో మొదటిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. 1985లో ప్రారంభించిన ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి తొలి వీసీగా ఆయనే పని చేశారు. దూరవిద్య కోసం ఆయన చేసిన కృషికి గాను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దూరవిద్య విభాగానికి రాంరెడ్డి పేరు పెట్టారు. 1991లో యూజీసీ ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. 1995లో లండన్‌లో మృతి చెందారు.

■ ఆర్థికవేత్త పెన్నమనేని హనుమంతరావు కోనరావుపేట మండలం నాగారంలో 1929లో జన్మించారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి 1961లో ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ పొందారు. కేంద్ర ప్రణాళిక విభాగంలో పని చేసిన ఆయన 20 సూత్రాల సలహా కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. వ్యవసాయ అర్థశాస్త్రం, పేదరికం, ఆర్థిక సంస్కరణలు, అభివృద్ధి అంశాలపై వందకుపైగా పరిశోధన పత్రాలు, పుస్తకాలు రచించారు. 2012 నుంచి 2014 వరకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం కులపతిగా పని చేశారు.




సి.నారాయణరెడ్డి
జి.రాంరెడ్డి
పి.హెచ్.హనుమంతరావు
జీవన్ శ్రీనివాస్
సంకశాల మల్లేశం



■ జిల్లాలో హన్మాజీపేట గ్రామం పేరు వినగానే డా.సి.నారాయణరెడ్డి గుర్తుకు వస్తారు. విద్యావేత్త సంకశాల మల్లేశంది అదే గ్రామం. ఒక సాధారణ వ్యవసాయకూలీ కుటుంబం నుంచి విశ్వవిద్యాలయ వీసీ స్థాయికి ఆయన ఎదిగారు. గ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన సిరిసిల్ల ఎస్సీ వసతి గృహంలో ఉంటూ పదో తరగతి వరకు చదివారు. ఇంటర్, డిగ్రీ, పీజీ హైదరాబాద్‌లో పూర్తి చేశారు. 1990లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ తత్వశాస్త్రం పూర్తి చేసిన ఆయన అక్కడే ఎంఫిల్ కూడా చేశారు. జర్మనీలో పీహెచ్‌డీ చేసి పలు కళాశాలల్లో తత్వశాస్త్ర ఆచార్యుడిగా పని చేశారు. మే 24, 2021 నుంచి మే 21, 2024 వరకు కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం వీసీగా వ్యవహరించారు.

■ తాజాగా పాలమూరు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన జీవన్ శ్రీనివాస్ గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందినవారు. ఆయన పదో తరగతి వరకు గంభీరావుపేటలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు. కామారెడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1995లో జేఎన్‌టీయూ నుంచి ఈఈఈలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. తాత్కాలిక అధ్యాపకుడిగా పని చేస్తూనే 1997లో ఎంటెక్ పూర్తిచేశారు. 2003లో జేఎన్‌టీయూలో అసోసియేట్ ఆచార్యులుగా విధుల్లో చేరారు. 2022లో కొంత కాలం సిరిసిల్ల జేఎన్‌టీయూ ప్రధానాచార్యులుగా పనిచేశారు. ఆచార్యులుగా, ప్రధానాచార్యులుగా, జేఎన్‌టీయూ పరిశోధన కమిటీ ఛైర్మన్‌గా అంచెలంచెలుగా ఎదుగుతూ వీసీ స్థాయికి చేరుకున్నారు. - న్యూస్‌టుడే, గంభీరావుపేట



నిటారుగా బండ.. ఆధారం లేకుండా!

సుల్తానాబాద్ మండలం కదంబాపూర్, తొగర్రాయి గ్రామాల మధ్య ఎత్తయిన గుట్టలున్నాయి. అందులో ఒకటైన పాండవుల గుట్టపై ఓ బండరాయి ఎలాంటి ఆధారం లేకుండా ఇలా నిలబడి ఉండటం చూపరులను ఆకట్టుకుంటోంది. – ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, సుల్తానాబాద్

అపోహ వీడండి... చలామణి పెంచండి

రూ.10 నాణెం చెల్లుబాటుపై ప్రచారం

న్యూస్‌టుడే, ఫెర్టిలైజర్ సిటీ

కొంతకాలంగా రూ.10 నాణెం చెల్లుబాటులో లేదనే అపోహలు తీవ్రమయ్యాయి. బడా వ్యాపారులతో పాటు యాచకులు సైతం నాణెం తీసుకునేందుకు నిరాకరించే పరిస్థితులు నెలకొన్నాయి. చిరిగిన నోటు తీసుకుంటున్నారు కాని నాణేం మాత్రం వద్దంటున్నారు. కొందరికి చెల్లుబాటులో ఉందని తెలిసినా.. నిరాకరిస్తున్న సంఘటనలున్నాయి. దీంతో మార్కెట్‌లో చిల్లర కొరత తీవ్రమవుతుంది. ఈ క్రమంలో ఈ నాణెం చెల్లుబాటులో ఉందని.. దీనిపై అపోహలు, దుష్ప్రచారాలు వీడి చలామణిని పెంచాలంటూ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా విస్తృత ప్రచారానికి పూనుకుంది.

బ్యాంకులో పంపిణీ..: ఇప్పటికే ఆర్‌బీఐ ముద్రించిన పోస్టర్లను నగరంలోని పలు వ్యాపార సంస్థల ముందు అంటించడంతో నాణెం వినియోగంపై అవగాహన పెంచేలా చర్యలు తీసుకున్నారు. తాజాగా యూనియన్ బ్యాంకులోని వివిధ శాఖల్లో ఈ నాణేల పంపిణీ తప్పనిసరి చేశారు. గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని యూనియన్ బ్యాంకు శాఖలో ఇటీవల ఒక్కరోజే 50వేల రూ.10 నాణేలను వివిధ వ్యాపార, వాణిజ్య వర్గాలకు పంపిణీ చేశారు. ఈ నాణాన్ని 2005లో ప్రవేశపెట్టగా. . అప్పటినుంచి 2019 వరకు 14 సార్లు ఆర్‌బీఐ ముద్రించి మార్కెట్‌లోకి విడుదల చేసింది.



ఖాతాదారునికి రూ.10 నాణేలను పంపిణీ చేస్తున్న బ్యాంకు అధికారులు

నాణేలకు చట్టబద్ధత: రూ.10 నాణానికి చట్టబద్ధత ఉంది. నాణేం చలామణిలో లేదనేది కేవలం అపోహ మాత్రమే. దీనిపై ఇప్పటికే ఆర్‌బీఐ పలు మార్లు స్పష్టం చేసింది. ఇప్పటికైనా వివిధ వర్గాల వారు అపోహలు వీడి.. చిల్లర కొరత తీర్చుకోవాలి.
– హిమాన్షు బారిక్, మేనేజర్, యూనియన్ బ్యాంకు, గోదావరిఖని (లక్ష్మీనగర్)

నేడు ఎల్ఎండీ గేట్ల ఎత్తివేత

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: మధ్యమానేరు జలాశయం నుంచి ఎల్ఎండీకి అధికంగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆదివారం ఉదయం 7 గంటలకు ఎల్ఎండీ గేట్లు ఎత్తనున్నట్లు నీటి పారుదల శాఖ ఈఈ పి.నాగభూషణ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యమానేరు జలాశయం నుంచి సుమారు 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. గేట్లను ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని మానేరు నదిలోకి వదలనున్నారు. నదీ పరివాహక ప్రాంతంలోకి పశువులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు, రైతులు వెళ్లవద్దని కోరారు.

బోయినపల్లి : రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) నుంచి ఎల్ఎండీకి శుక్రవారం నీటిని విడుదల చేశారు. జలాశయం రెండు గేట్ల నుంచి 4,300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.86 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే- ధర్మారం

? గోపాల్‌రావుపేటలో శ్మశానవాటిక దారిలో మార్చి నెలలో సీసీ రహదారి నిర్మించారు. క్యూరింగ్ కోసం చేసిన కట్టలు తొలగించకపోవడతో కాలినడకకు ఇబ్బందిగా మారింది. -భారతపు స్వామి

✔ సీసీ రహదారిపై కట్టలను వెంటనే తొలగించి, అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటాం.

? ధర్మారం ఆదర్శ పాఠశాలలో సెప్టిక్ ట్యాంకు నిర్మాణం అసంపూర్తిగా ఉండి, విద్యార్థులకు అసౌకర్యంగా ఉంది. -శ్రీనివాస్

✔ ఆదర్శ పాఠశాలలో పూర్తయిన నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే మంజూరు చేసి, మిగిలిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

-పైరెండు సమస్యలకు పీఆర్ ఏఈ రాజశేఖర్ సమాధానమిచ్చారు.

తాగునీటి పైపులైనుకు మరమ్మతులు

ఈనాడు స్పందనకు వందనం

ధర్మారం, న్యూస్‌టుడే: ధర్మారంలో తాగునీటి సరఫరాలో సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శి రవి కిరణ్ శ్రీకారం చుట్టారు. 'నిర్వహణ లోపం.. తాగునీరే గరళం' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి శనివారం పట్టణంలోని తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయించారు. పైపులైన్ల లీకేజీల మరమ్మతు పనులు చేపట్టారు.

నేర వార్తలు

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

ఓదెల, న్యూస్‌టుడే: గుర్తు తెలియని రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన ఓదెల మండలంలో చోటు చేసుకుంది. రామగుండం జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి కథనం ప్రకారం మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా చని గ్రామానికి చెందిన పురుషోత్తం శ్రవణ్‌ఘోటి వసస్సు(23) చైన్నైలో కూలీ పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. స్వస్థలానికి వెళ్లడానికి రైలు ఎక్కిన అతడు మార్గమధ్యంలో దిగాడు. మతిస్థిమితం లేక పొత్కపల్లి పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు స్థానికులు గుర్తించారు. ఈ క్రమంలో శుక్రవారం గొల్లపల్లి రైల్వే ట్రాక్ పక్కన నడుచుకుంటూ వెళ్తూ గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానిక రైతులు శనివారం పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

భార్య దూరమైన ఎనిమిది రోజులకే భర్త మృతి


రాజమ్మ


బాణయ్య

ముత్తారం, న్యూస్‌టుడే: భార్య చనిపోయిన దాదాపు వారం రోజుల వ్యవధిలో భర్త మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నింపింది. ముత్తారం మండలం హరిపురం గ్రామానికి చెందిన అడ్డూరి రాజమ్మ(75) అనారోగ్య కారణాలతో ఎనిమిది రోజుల కిందట మృతి చెందారు. అప్పటి నుంచి ఆమె భర్త బాణయ్య(80) మనో వేదనకు గురయ్యారు. శనివారం మధ్యాహ్నం భోజనం చేసి పడుకున్న ఆయన నిద్రలోనే కన్నుమూశారు. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): రామగిరి మండలం బేగంపేటకు చెందిన గీతకార్మికుడు బిటుకు కొమురయ్యగౌడ్ ఈత చెట్టు పై నుంచి పడి గాయపడ్డాడు. చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడటంతో ఛాతి భాగంలో గాయాలయ్యాయి. అతడిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

చోరీకి యత్నించిన వ్యక్తి ఆచూకీ తెలపండి


మంథని పోలీసులు విడుదల చేసిన దుండగుడి చిత్రం

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: గుంజపడుగులో శుక్రవారం సాయంత్రం చోరీకి యత్నించిన వ్యక్తి ఆచూకీ తెలిస్తే తెలపాలంటూ పోలీసులు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖానికి ముసుగు కట్టుకొని మినీ ఏటీఎం నడుపుతున్న మహిళ ఇంట్లోకి చొరబడిన దుండగుడు కత్తితో ఆమెను బెదిరించిన వీడియోలు, ఫొటోలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. ఈ మేరకు దుండగుడి ఫొటోలు విడుదల చేసిన పోలీసులు గుర్తుపట్టిన వారు 87126 56528, 87126 56529 నెంబర్లలో సమాచారం అందించాలని సూచించారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్టు

నస్పూర్, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాల దొంగలను శ్రీరాంపూర్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 4 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ వివరాలు వెల్లడించారు. గోదావరిఖనికి చెందిన అజ్మీరా అక్షయ్ కుమార్, దొంతుల ప్రశాంత్, సెల్వ, పృథ్వీ నలుగురు జల్సాలకు అలవాటు పడి శ్రీరాంపూర్, జైపూర్, రామగుండం ఏరియాలో ద్విచక్ర వాహనాలను అపహరించుకుపోయారు. వారు దొంగిలించిన వాహనాలను మంచిర్యాలలో విక్రయించడానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో శ్రీరాంపూర్ పోలీసులు జీఎం కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేయగా సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి విచారణ చేపట్టారు. కాగా దొంగతనం చేసినట్టు నలుగురు ఒప్పుకోవడంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, ఎస్సై సంతోష్, కానిస్టేబుళ్లు శ్రీను, సత్యంలను అభినందించారు.


రోడ్డు ప్రమాదంలో గాయాలు

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎన్టీపీసీ పరిధిలోని టెంపర్‌వరీటౌన్‌షిప్ చౌరస్తా వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇరువురికి గాయాలయ్యాయి. ఎన్టీపీసీ పీకేరామయ్యకాలనీకి చెందిన కరణ్.. రామగుండం మండలానికి చెందిన రమేష్ ఎన్టీపీసీకి వస్తున్న క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు టీటీఎస్ చౌరస్తా వద్ద ఢీ కొట్టాయి. సమీప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ట్రాన్సుఫార్మరు వద్ద రైతుకు విద్యుదాఘాతం

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌కు చెందిన కుక్కల సాగర్ శనివారం విద్యుదాఘాతానికి గురయ్యాడు. పొలంలో ట్రాన్స్‌ఫార్మరు నుంచి విద్యుత్తు సరఫరా కాకపోవడంతో ఫ్యూజు మార్చే యత్నం చేశారు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురి కాగా ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు.

అనారోగ్యంతో సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి మృతి


గండ్ర రాజేశ్వరరావు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి చెందిన సీపీఐ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి గండ్ర రాజేశ్వరరావు(76) అనారోగ్యంతో శనివారం హైదరాబాద్‌లో మృతి చెందారు. 1980-90 కాలంలో ఆయన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పని చేశారు. సుల్తానాబాద్ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. మాజీ ఎమ్మెల్యేలు చెన్నమనేని రాజేశ్వరరావు, దేశిని చిన్నమల్లయ్యల ఆధ్వర్యంలో అనేక ప్రజా ఉద్యమంలో పాల్గొని పేరు పొందారు. 20 ఏళ్లుగా హైదరాబాద్‌లో స్థిరపడిన రాజేశ్వరరావుకు భార్య సత్తమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు.

'అవగాహన లేని వ్యాఖ్యలు సరికాదు'

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: భారాస నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఐఎన్‌టీయూసీ ఆర్జీ-3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి ఆరోపించారు. సెంటినరీకాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుశి కంపెనీ కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ఇవ్వకుండా వెళ్లిపోతే, ఇందుకు కారణం మంత్రి శ్రీధర్‌బాబు అని చెప్పడం సిగ్గుచేటన్నారు. కార్మికుల బోనస్ చెల్లించిన తర్వాతే కంపెనీకి రావాల్సిన లావాదేవీలను సింగరేణి సంస్థ క్లియర్ చేసి పంపించిందన్నారు. భారాస హయాంలో కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరిస్తామని చెప్పి చేయలేదన్నారు. జిల్లా జనరల్ సెక్రెటరీ కిరణ్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకులు కిలిశెట్టి సాయికృష్ణ, బత్తుల రమేశ్, రామిళ్ల మనోహర్, మడ్డి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలోని వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సెంటినరీకాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఆర్జీ-3, ఏపీఏ, భూపాలపల్లి ఏరియా క్రీడాకారుల మధ్య రీజినల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. అడ్రియాల ప్రాజెక్టు ఏరియా ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ పోటీలను ప్రారంభించగా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెస్క్యూ పోటీల్లో అడ్రియాల జట్టు ప్రతిభ


జట్టు సభ్యులను అభినందిస్తున్న జీఎం వెంకటేశ్వర్లు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఈ నెల 16, 17 తేదీల్లో ఆర్జీ-2లోని రామగుండం రెస్క్యూ స్టేషన్‌లో జరిగిన 53వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీల్లో అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు ఏరియా సభ్యులు సత్తా చాటారు. బెస్ట్ రెస్క్యూ అండ్ రికవరీలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ మేరకు శనివారం జట్టు సభ్యులను ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు అభినందించారు. ఏపీఏ ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చంద్రశేఖర్

సంస్థ స్థితిగతులపై సమావేశం



గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణిలోని వివిధ విభాగాల ఉద్యోగులకు సంస్థ స్థితిగతులపై శనివారం అవగాహన కల్పించారు. మల్టీ డిపార్టుమెంటు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్జీ-1 క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జీఎం చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. సంస్థ అభివృద్ధికి సమిష్టిగా పనిచేయాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. అధికారులు ఆంజనేయులు, రాజన్న, శ్రావణ్‌కుమార్, సారంగపాణి, గుర్తింపు సంఘం నాయకులు ఎల్లయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

గుండెనొప్పితో సింగరేణి ఉద్యోగి మృతి

వైద్యుల నిర్లక్ష్యమేనని నాయకుల ఆరోపణ


సురేష్

గోదావరిఖని, న్యూస్‌టుడే: మంచిర్యాలలోని రామకృష్ణాపూర్ ఓసీపీలో ఓవర్‌మెన్‌గా పనిచేస్తున్న సురేష్(40) శనివారం హఠాన్మరణం చెందారు. సురేష్ ఉదయం ఛాతి నొప్పితో గోదావరిఖనిలోని సింగరేణి ఆసుపత్రిలో చేరాడు. ఇదివరకే అతను గుండె సంబంధిత వైద్యం చేయించుకున్నాడు. హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స అందించేందుకు రిఫర్ చేయాలని అతని కుటుంబసభ్యులు వైద్యులను కోరారు. అయితే కరీంనగర్‌కు రిఫర్ చేయడంతో అక్కడికి వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో అతని పరిస్థితి విషమంగా మారింది. చివరికి హైదరాబాద్ రిఫర్ చేసేందుకు వైద్యులు ఏర్పాటు చేశారు. మార్గమధ్యలో సురేష్ మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడంటూ తెబొగకాసం నాయకులు ఆరోపిస్తున్నారు.

ఆ కుటుంబంలో వరుస విషాదాలు

స్థానిక పరశురాంనగర్‌కు చెందిన సురేష్ కుటుంబంలో నెల రోజుల్లో ముగ్గురు మృతి చెందడం.. కుటుంబసభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చింది. సురేష్ శనివారం మృతిచెందగా. . గత నెల 16న అతని తల్లి భూమక్క, మూడు రోజుల క్రితం అతని సోదరుడు సంతోష్ అకాల మరణం చెందడం ఆ కుటుంబాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

దాడులను ఖండిస్తూ ఆందోళన


నగరపాలక కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పలు సంఘాల నాయకులు

గోదావరిఖని పట్టణం: హిందూ ఆలయాలపై జరుగుతున్న వరుస దాడులకు నిరసనగా విశ్వహిందూ పరిషత్తు, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం రామగుండం నగరపాలక కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. హైదరాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో దేవతా విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ బైఠాయించారు.

పెద్దపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరోధించి, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్తు కార్యకర్తలు శనివారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నాగుల మల్యాల సత్యం, ప్రఖండ ప్రముఖ్ బత్తుల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంథని: హైదరాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ మంథని విశ్వహిందూ పరిషత్ నాయకులు శనివారం ఆర్డీవో కారాలయ ఏవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, ప్రతినిధులు రాజమౌళి గౌడ్, స్వామి, అశోక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దిగువ ప్రాంతాలకు నీరందించండి


వంట చేస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. జనగామ గ్రామంలో రైతు సమస్యలపై శనివారం వంటవార్పు నిర్వహించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని, దిగువ ప్రాంత రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్లు భారాస నాయకులు పాల్గొన్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

ముత్తారం: పోతారం జడ్పీ పాఠశాలను శనివారం డీఈవో మాధవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలును, తరగతులను పరిశీలించారు.


మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న కార్మిక గుర్తింపు సంఘం నాయకులు. పక్కన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కార్మికుల బోనస్‌పై మంత్రికి వినతి

పాలకుర్తి, న్యూస్‌టుడే: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగార శాశ్వత కార్మికులకు దీపావళి బోనస్ చెల్లింపులపై ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆధ్వర్యంలో కేశోరాం గుర్తింపు సంఘం నాయకులు హైదరాబాద్‌లోని సచివాలయంలో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబును శనివారం కలిసి విన్నవించారు. బోనస్ చెల్లింపు విషయమై మంత్రి కోల్‌కతాలోని కేశోరాం ప్రధాన అధికారి రాధాకృష్ణతో చరవాణిలో మాట్లాడగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు తెలిపారు.

ఇంజినీరింగ్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని నేరాలకు దూరంగా ఉండాలని సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ పేర్కొన్నారు. దుబ్బపల్లి నిగమ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన చట్టాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, రమేశ్, ఏజీపీ లక్ష్మీరాజం, న్యాయవాదులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక సీఈఆర్ క్లబ్ ఆవరణలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. గోదావరిఖని మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై చట్టాలపై విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై కనీస అవగాహన ఉండాలన్నారు. జడ్జి అడిగిన పలు ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం చెప్పడంతో వారికి జ్ఞాపికలు ఇచ్చి అభినందించారు. ఎస్సై అహ్మదుల్లా, న్యాయవాదులు సదన్‌కుమార్, భూమయ్య, చరణ్, శ్రావణ్ పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీనివాసరావు

చేప పిల్లలు నాసిరకంగా ఉన్నాయని నిరసన

మంథని, న్యూస్‌టుడే: చెరువులో పెంపకానికి ప్రభుత్వం సమకూర్చే చేప పిల్లలు నాసిరకంగా ఉన్నాయంటూ మత్స్యకారులు వాటిని వెనక్కి పంపిన ఘటన మంథనిలో శనివారం చోటుచేసుకుంది. మండలంలోని 13 మత్స్య సహకార సంఘాలకు పంపిణీ చేయడానికి గుత్తేదారు మొత్తం 2 లక్షల చేప పిల్లలను తీసుకొచ్చారు. అవి చిన్నగా, నాసిరకంగా ఉండటంపై మత్స్యకారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి వెనక్కి పంపారు. పది రోజుల కిందట మంథనికి వచ్చిన మత్స్య కార్పొరేషన్ ఛైర్మన్ మంథనికి వచ్చినపుడు చేప పిల్లల నాణ్యతపై అధికారులకు, గుత్తేదారులకు సూచనలు చేసినా, మళ్లీ అలాగే పంపిణీ చేయాలనుకోవడం సరికాదని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ క్రాంతికుమార్ పేర్కొన్నారు. అధికారుల నుంచి సమాధానం రాకపోవడంతో వెనక్కి పంపుతున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



కమాన్‌పూర్ పాఠశాలలో పంపిణీ చేసిన బ్యాగులతో విద్యార్థులు

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్, జూలపల్లి, రొంపికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 7, 8 తరగతులు చదివే విద్యార్థులకు యూత్ ఫర్ సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం స్కూల్ బ్యాగులు, నిఘంటువులు, చూచిరాత పుస్తకాలు, కంపాక్స్ బాక్సులు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు రజిత, మహేశ్, శరత్, శ్రీకాంత్, అరుణ్‌తేజ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాళ్లు సరళ, సుజాత, నిర్మలజ్యోతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ ఏర్పాట్లపై సమీక్ష


బొమ్మారెడ్డిపల్లి శివారులో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: జిల్లాలో వానాకాలం ధాన్యం సేకరణను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పేర్కొన్నారు. సుల్తానాబాద్ ప్యాక్స్ కార్యాలయంలో శనివారం సర్కిల్ పరిధిలోని సహకార సంఘాల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. 8 సంఘాల ఆధ్వర్యంలో 57 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ధాన్యం తూకం వేసిన వెంటనే ట్రక్‌షీట్ తయారు చేసి 48 గంటల్లో రైతులకు చెల్లింపులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సహకార అధికారిణి శ్రీమాల, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ, సహకార సంఘాల అధికారులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ప్రభుత్వ భూముల సర్వే

ధర్మారం: ప్రభుత్వ భూముల సర్వే కట్టుదిట్టంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సర్వే విభాగం అధికారులను ఆదేశించారు. బొమ్మారెడ్డిపల్లి శివారులో చేపట్టిన ప్రభుత్వ భూముల సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఖిలావనపర్తిలో సర్వే పూర్తయిందని, బొమ్మారెడ్డిపల్లిలో అదనపు బృందాలను ఏర్పాటు చేసి త్వరగా పూర్తి చేయాలని ఏడీ శ్రీనివాస్‌కు సూచించారు. తహసీల్దారు మహ్మద్ అరీఫ్, సర్వేయర్లు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు సామగ్రి వితరణ

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు ఇంటి వద్ద చదువుకునేందుకు వీలుగా బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు మల్కా రాంకిషన్‌రావు, తన మిత్రులు తులసీరావు, రవితేజ, శ్యామల సహకారంతో స్టడీ కార్నర్ పేరిట విద్యా సామగ్రిని సమకూర్చారు. 23 మంది విద్యార్థులకు రూ.2200 చొప్పున వెచ్చించి టేబుల్, ఛైర్ ప్యాడ్, ఎల్‌ఈడీ ల్యాంప్‌తో కూడిన సామగ్రికి మొత్తం రూ.50,600 వెచ్చించారు. ఈ మేరకు శనివారం డీఈవో మాధవి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు మేరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు సంకటహర చతుర్థి పూజలు

ఫెర్టిలైజర్ సిటీ: సంకటహర చతుర్థి సందర్భంగా ఫెర్టిలైజర్ సిటీలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయంలోని గణపతి మూలవిరాటుకు ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఫెర్టిలైజర్ మందిర్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఉపాధ్యాయురాలు దండించడంపై ఆందోళన

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎన్టీపీసీ పరిధిలోని మేడిపల్లి ప్రాంతంలో ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి.. పరీక్షలో కాపీ కొడుతున్నాడని ఉపాధ్యాయురాలు దండించారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. తమ పిల్లవాడికి ఫిట్స్ వచ్చి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వాపోయారు. దీనిపై న్యూస్‌టుడే పాఠశాల నిర్వాహకులను వివరణ కోరగా.. ఆ అబ్బాయికి ముందునుంచే జ్వరంగా ఉందని, క్రమశిక్షణలో భాగంగా దండించడం జరిగిందని పోషకులకు చెప్పినట్లు తెలిపారు.

సంఘాలు-నియామకాలు

పాలకుర్తి(రామగుండం): మండలంలోని కుందనపల్లి గ్రామ పంచాయతీ పరిధి అక్బర్‌నగర్‌కు చెందిన రాజేందర్ కుమార్ హ్యూమన్ రైట్స్ కౌన్సెలింగ్ ఫర్ ఇండియా (హెచ్‌ఆర్సీఐ) జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ ఛైర్మన్ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు శనివారం నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు.

పదోన్నతి కల్పించాలి

యైటింక్లయిన్‌కాలనీ: 190 మస్టర్లు నిండిన ప్రతి ఒక్క బదిలీ వర్కర్‌కు జనరల్ మజ్దూర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నరసింహారావు కోరారు. నెలక్రితమే జనరల్ మజ్దూర్లుగా అర్హత సాధించిన యువ ఉద్యోగులకు పదోన్నతి కల్పించడంలో యాజమాన్యం తాత్సారం చేస్తున్న తీరుతో మనోవేదనకు గురవుతున్నారన్నారు.

నాయకుడి మృతికి సంతాపం

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో గతంలో గుర్తింపు సంఘం నాయకుడిగా పనిచేసిన జలీల్ అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. కేశోరాం గుర్తింపు సంఘం నాయకులు, కార్మికులు సంతాపం తెలిపారు.

ఓటరు నమోదుపై అవగాహన

మార్కండేయకాలనీ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుపై టీపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులకు అవగాహన కలిగించారు. గోదావరిఖని శారదానగర్‌లోని శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఈ కార్యక్రమం జరగగా.. ఆ ఫోరం జిల్లా అధ్యక్షులు రాజేష్, నాయకులు మూర్తి, రాజిరెడ్డి, దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

జమిలి ఎన్నికలు రద్దు చేయాలి

గోదావరిఖని: జమిలి ఎన్నికలు అభివృద్ధికి విఘాతం కలిగిస్తాయని.. దీన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ డిమాండ్ చేశారు. ఈ విధానాన్ని ప్రజాస్వామికవాదులు వ్యతిరేకించాలని కోరారు. నాయకులు యాకయ్య, ముత్యంరావు, మహేశ్వరీ, శ్రీనివాస్, శంకర్, రవీందర్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

మంథని: మంథని బీసీ కాలనీలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలంటూ పట్టణానికి చెందిన ఆరెల్లి కిరణ్‌గౌడ్, డిగంబర్, తిరుపతి శనివారం అదనపు కలెక్టర్ అరుణశ్రీకి ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సర్వే నెంబరు 13లో పద్మశాలి, గౌడ సామాజిక వర్గీయులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిందని, పట్టాలు లేని వారు స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

కమాన్‌పూర్: కమాన్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రం-1లో శనివారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నారుల ఎత్తు, బరువును కొలిచి, గ్రహణం మొర్రి, గుండె సంబంధిత పరీక్షలు జరిపారు. డాక్టర్ విజయ్‌కుమార్, ఐశ్వర్య, ఫార్మసిస్ట్ శారద పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ధర్మారం: గోపాల్‌రావుపేటకు చెందిన భారాస కార్యకర్త ఆరెల్లి రాజేశం తండ్రి నర్సయ్య, బొట్లవనపర్తి భారాస గ్రామ మాజీ అధ్యక్షుడు సిరికొండ మల్లేశం తండ్రి రాజం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రెండు కుటుంబాలను శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. సహకార సంఘం ఛైర్మన్ బలరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు(సుల్తానాబాద్): ఎలిగేడు మండలం లాలపల్లికి చెందిన భారాస గ్రామ నాయకుడు గుర్రం మల్లారెడ్డి ఇటీవల రహదారి ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకుర్తి: ఈసాలతక్కళ్లపల్లి, కుక్కలగూడూరు, వేంనూర్, పాలకుర్తి, పుట్నూరు, రామారావుపల్లి గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ శనివారం పరామర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పలు గ్రామాల శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

ఓదెల: గత భారాస పాలకుల నిర్లక్ష్య వైఖరితో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రేంసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. ఓదెల మండలం రూపునారాయణపేట నుంచి ఇందుర్తి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరైన నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్యాక్స్ ఛైర్మన్ సుమన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే విద్యార్థుల మేధో వికాసం

ఓదెల: ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయంతోనే విద్యార్థుల్లో మేధో వికాసం సాధ్యమని విద్యాశాఖ సీఎంవో, ఏఎస్‌సీ అజీముద్దీన్ దబీర్ అన్నారు. శనివారం ఆయన గోపరపల్లె, హరిపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యార్థులకు అందించే గుర్తింపు సంఖ్య అపార్ ఐడీపై వివరించారు. ప్రధానోపాధ్యాయులు, ఏపీసీ ఛైర్మన్లు, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

ఓదెలలో మహిళా కమిషన్ సభ్యుల పర్యటన

ఓదెల: రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు కటారి రేవతిరావు, సుధాలక్ష్మి శనివారం ఓదెలలో పర్యటించారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతోపాటు, తారకరామ కాలనీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. బాలికలకు, చిన్నారులకు అందుతున్న పోషకాహారం పరిశీలించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమాదేవి తదితరులున్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

మంథని: మంథని పట్టణంలో ఇందిరా మహిళాశక్తి పథకం కింద ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని, బిర్యాని సెంటర్‌ను మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాదేవి శనివారం ప్రారంభించారు. పథకంలో భాగంగా బ్యాంకు లింకేజీ కింద రూ.15 లక్షలు మంజూరు కాగా 11వ వార్డులో సంఘం మహిళలు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వైస్ ఛైర్మన్ బానయ్య, కౌన్సిలర్ వీకే రవి పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

పెద్దపల్లి కలెక్టరేట్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని తట్టుకుంటేనే జీవిత లక్ష్యాలు చేరుకుంటారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీహరి అన్నారు. గాయత్రి విద్యానికేతన్‌లో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.